ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 6 ఫిబ్రవరి 2024

జాతర ఏర్పాట్లలో యాజమాన్యాలు చొరవ తీసుకోవాలి 8లో..

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి 8లో..





అధికారుల బదిలీలకు కసరత్తు

- మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం
- మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో బదిలీలు
- వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్ని శాఖల్లో అధికారుల బదిలీలపై దృష్టి సారించింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్, పోలీస్ శాఖలో ఎస్‌ఐ నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ఇతర శాఖల్లో కూడా బదిలీలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిందరికీ స్థానచలనం కల్పించేందుకు వివరాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లరు ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాల్లో గెలుపొంది అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రాధామ్యాలను అనుసరించి ఆయా శాఖల్లో పైనుంచి కింది స్థాయి వరకు బదిలీలు చేయడం సహజమే. జిల్లా స్థాయిలో ప్రతి యేటా జరగాల్సిన సాధారణ బదిలీలు జరగడం లేదు. దీంతో జిల్లాలో మూడేళ్లకు మించి పనిచేస్తున్న అధికారులు ఉన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లా స్థాయి అధికారులు, డివిజన్‌స్థాయి అధికారులు, మండలాల్లో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులు ఎవరైతే మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారందరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారుల వివరాలను పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

● ముందుగా పంచాయతీరాజ్ శాఖలో...

పెద్దపల్లి జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ఆయా శాఖల్లో అనేక మంది అధికారులు పని చేశారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వాళ్లు సైతం ఉన్నారు. ముందుగా పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని భావిస్తున్నారు. ఈ శాఖలో చాలా ఏళ్లుగా ఎంపీడీవోలు ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారందరి బదిలీలు తప్పేలా లేదు. జోనల్ స్థాయిలో గానీ, జిల్లాలో గానీ వారిని బదిలీ చేయవచ్చని తెలుస్తున్నది. జిల్లా స్థాయిలో డీఆర్‌డీవో వి శ్రీధర్, జడ్పీ సీఈవో ఎం శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. సదరు అధికారులు మూడేళ్లుగా ఇక్కడ పని చేస్తున్నారు. సాధారణ బదిలీల పరంగానే గాకుండా, మరో రెండు మాసాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు వెలువడే వరకు వేచి చూసే కంటే ముందుగానే బదిలీ చేస్తే ఇబ్బందులు ఉండవని ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వారం రోజుల్లో పంచాయతీరాజ్ శాఖలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల బదిలీలు జరగనున్నాయి. అలాగే జిల్లా ఏర్పాటైన నాటి నుంచి కూడా ఇక్కడే పని చేస్తున్న అధికారులు ఉన్నారు. మూడేళ్లకు మించి పనిచేస్తున్న అధికారుల్లో జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి తిరుపతిరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, మధ్యలో ప్రమోద్ కుమార్ బదిలీ అయినప్పటికీ, ఆ వెంటనే తిరిగి ఇక్కడకే వచ్చారు. గనులు భూగర్భ శాఖ ఏడీ సాయినాథ్, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నాగ్రెలేశ్వర్, ఆయా శాఖల అధికారులు పనిచేస్తున్నారు. వారిలో కొందరిని బదిలీచేసే అవకాశాలున్నాయని సమాచారం. ఎవరిని ఎక్కడకు బదిలీ చేస్తారోనని అధికారుల్లో ఉత్కంఠ నెలకొన్నది.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ పెద్దపల్లి ఆర్డీవో సీహెచ్ మధుమోహన్‌తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామ నివాసి జి చంద్రమౌళి వారసత్వంగా తనతండ్రి నుంచి వచ్చిన భూమిని ధరణిలో నమోదు చేయుటకు కోరుతూ దరఖాస్తు సమర్పించారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామ నివాసి చొప్పరి లక్ష్మి తనకు లొంక కాసారం శివారులో రెండు ఎకరాలు ఉన్నదని, ధరణిలో భూమి వివరాలు నమోదు చేసి, రైతుబంధు సొమ్ము జమ చేసేందుకు కోరుతూ దరఖాస్తు చేశారు. రామగిరి మండలం తహసీల్దార్‌కు రాస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని పెద్దబోంకూర్‌లో కోతుల బెడద అధికంగా ఉందని, గ్రామ ప్రజలపై దాడులు చేస్తున్నాయని వెంటనే వాటిని నివారించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి గ్రామస్థులు మిట్టపల్లి శ్రీనివాస్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. కోతుల బెడదతో కొంతమంది బిల్డింగ్‌ల నుండి జారీ పడి గాయాల పాలుకాగా ప్రాణాలు కూడ కోల్పోయారని వివవరించారు. విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లాలంటే భయంతో జంకుతున్నారని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో మిట్టపల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 5: పెద్దపల్లి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దెల్లి తేజస్వినిప్రకాష్‌ను నియమించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ గ్రామ స్థాయిలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేసి ఒక్కొక్క గ్రామంలో వంద మంది యువతీయువకులను తయారు చేసి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సురభి దివేది, రమేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరంతో రైతు మృతి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 5: మండలంలోని సిద్దిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని శాలపల్లె గ్రామానికి చెందిన మాటేటి రమేష్(52) అనే రైతు జ్వరంతో సోమవారం మృతి చెందాడు. నాలుగు రోజులుగా జ్వరంతో బాదపడుతున్న రమేష్‌కు ఒకసారిగా రక్త కణాలు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పేద రైతు అయినా రమేష్ కుటుంబానికి రైతు బీమా అందించడంతో పాటు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఓదెల వాసికి జాతీయ పురస్కారం

ఓదెల, ఫిబ్రవరి 5: మండల కేంద్రానికి చెందిన క్యాతం శ్రీనివాస్ అనే టైలర్ కు హనుమకొండ టీఎన్జీవో భవన్‌లో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాన్ని అందజేశారు. శ్రీనివాస్ ఎంబ్రాయిడర్ కళా సేవరంగంలో కొన్నాళ్ల నుంచి కృషి చేస్తున్నందున శాంతి కృష్ణ సేవా సమితి, విశ్వకర్మ సేవా ఫౌండేషన్, తెలుగు వెలుగు సాహితి వేదిక, సౌజన్యంతో స్వామి వివేకానంద,నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ జాతీయ పురస్కారాల మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వందలాది మంది హాజరయ్యారు. ఓదెల నుంచి శ్రీనివాస్ కు పురస్కారం, సన్మానం పొందడంపై మిత్రులు, గ్రామస్తులు, పద్మశాలి సంఘం, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

'నాగండ్ల'కు విశిష్ట విద్యారత్న ప్రతిభ అవార్డ్



అవార్డును అందజేస్తున్న జేసీఐ ప్రతినిధులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 5: గోదావరిఖనికి చెందిన కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. దశాబ్ధకాలం పైగా విద్యాసేవలందిస్తున్న నాగండ్ల రవికుమార్‌కు జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) స్వచ్ఛంద సంస్థ విశిష్ట విద్యారత్న అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు ఈనెల 4న మంచిర్యాల జిల్లాలో జరిగిన జేసీఐ మూడో సంస్థాపన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నాగండ్ల రవికుమార్‌కు జేసీఐ ప్రతినిధులు విశిష్ట విద్యారత్న అవార్డుతో సత్కరించారు. కాగా దశాబ్ధకాలం క్రితం కృష్ణవేణి వికాస్ కళాశాలను నెలకొల్పి ఎంతో మంది పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకన్న, అకాడమిక్ ప్రిన్సిపల్ ఎస్.తిరుపతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ, జెన్‌కో విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్, ఫిబ్రవరి 5: రామగుండంలో ఎన్టీపీసీ, జెన్‌కో ఆధ్వర్యంలో మరో రెండు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు కృషి చేస్తానని, ఈ ప్రాజెక్టుల సాధనలో విఫలమైతే రాష్ట్ర సచివాలయం పైనుంచి దూకుతానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో జరిగిన విలేకరుల సమావేశంలో మక్కాన్‌సింగ్ మట్లాడారు. అన్ని వనరులున్న ఈప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు, పారిశ్రామికం గా మరింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా పాటు పడుతానన్నారు. రామగుండం పట్టణంలో టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో 800 మెగావాట్ల యూనిట్, ఎన్టీపీసీలో 2400 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) స్టేజ్-2 ఏర్పాటు విషయంలో ఇప్పటికే రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించానన్నారు. తెలంగాణ ఎన్టీపీసీ స్టేజ్-2ను నిర్మించాల్సిన అవసరం లేదని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేయాల్సిన గత ప్రభుత్వం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఆ సంస్థ డబ్బుతో నిర్మించే ప్రాజెక్టును అడ్డుకోవడం శోచనీయమన్నారు. రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో జెన్‌కో ఆధ్వర్యంలో కొత్త యూనిట్ నెలకొల్పే విషయంలో తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

● ఎన్టీపీసీ అధిక సీఎస్ఆర్ నిధులివ్వాలి..

రామగుండం అభివృద్ధికి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులను అత్యధిక మొత్తంలో కేటాయించాలని మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు. దేశానికి వెలగులు పంచేందుకు ఈ ప్రాంత రైతులు తమ భూములను త్యాగం చేశారన్నారు. ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతులకు మాత్రమే సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయాలన్నారు. ప్రభుత్వాలు, నాయకుల ఒత్తిళ్లకు లొంగి ఇప్పటివరకు ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో ఖర్చు చేశారని తెలిపారు. ఇక ముందు సీఎస్ఆర్ నిధుల మళ్లింపును ఎట్టి పరిస్థితుల్లో జరుగనివ్వనని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, యువతకు ఉపాధి, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి ఎన్టీపీసీ యాజమాన్యం మరింత చొరవ చూపాలన్నారు. రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలను నెలకొల్పాలని ఎంఎల్ఏ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని పాఠశాలల్లో ఫీజు రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్టీపీసీ ఆసుపత్రిలో భూనిర్వాసితులకు వైద్యంతోపాటు అన్ని రకాల మందులను ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

● కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం..

రామగుండం కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎంఎల్ఏ స్పష్టం చేశారు. గతంలో పాలకులు చేసిన నిర్లక్ష్యం వల్లే ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. తాను ఎంఎల్ఏగా గెల్చిన ఈ కొద్ది కాలంలోనే కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి వినియోగిస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో కార్పొరేషన్‌లో ఏ ఒక్క అభివృద్ధి పని జరుగలేదని, కాగితాలపైనే కోట్ల రూపాయలు మంజూరైనట్లు లెక్కలు ప్రారని ఎద్దేవా చేశారు. రామగుండం బీ పవర్‌హౌజ్ నుంచి గంగానగర్ వరకు రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ విషయంలో ప్రజలు సహకరించాలని మక్కాన్‌సింగ్ కోరారు.

గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా విధులు నిర్వహించాలని, ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీ ప్రత్యేక అధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం విధులను ప్రత్యేక అధికారులు కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున మళ్లీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులతో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, గ్రామాల్లో మంచి పరిపాలన అందించే అవకాశం మనకు లభించిందని దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు గా నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంచా యతీ నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపు, అభివృద్ధి పనులు, తదితర అంశాల పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. ప్రతీ గ్రామ పంచా యతీలో ప్రస్తుత పారిశుధ్య పరిస్థితిని గమనించాలని, చెత్త సేకరణ, ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేరు చేయడం, గ్రామాల్లో రోడ్డుపై చెత్త వేయకుండా ఉండడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా చేస్తున్నామని, గ్రామాల్లో నూతనంగా కట్టుకున్న ఇళ్లు, ఎత్తయిన ప్రాంతాల్లోని ఇళ్లకు, వివిధ కారణాల వల్ల నీటి సరఫరా లేని ఇళ్లను మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ప్రత్యేక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, డీఆర్‌డీవో శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, మిషన్ భగీరథ అధికారులు, ట్రైనర్లు డీటీఎం సురేందర్, డీఎల్‌పీవో రాంబాబు, ఎస్పీఎం రాఘవులు, డీపీఎం రజాక్, జీపీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5: మండలంలోని నీరుకుళ్ల సమ్మక్క జాతర నిర్వహణపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన జాతర ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 21 నుంచి జరిగే జాతర కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకోవాని తహసిల్దార్ మధుసూదన్‌రెడ్డి వివిధ శాఖల అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్ వారు జాతర ప్రాంగణాన్ని సమీప స్థలాలను చదును చేయించాలని, హైమాస్ట్ లైట్లను, అందుబాటులో పారిశుధ్య సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ నెల 21 నుంచి 24 వరకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచుకోవాలని, పోలీస్‌శాఖ వారు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌ను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలన్నారు. మానేరులో నీరు అధికంగా ఉన్నందున మత్స్య శాఖ వారు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. జాతర రోజులలో అనుమతి లేని మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను అదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమ్మక్క-సారలమ్మ జాతరలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై నిషేధం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 5: ఈ నెల 21 నుంచి 24వరకు గోదావరిఖని గోదావరి తీరంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరలో అనధికారికంగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడాన్ని నిషేధిస్తున్నట్టు మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సీహెచ్ రాజేశ్వర్ తెలిపారు. సోమవారం మేయర్ చాంబర్‌లో గోదావరిఖని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు జాతర ప్రాంగణంలో హోర్డింగ్‌లను, ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించినట్టు, దీనికి ప్రత్యామ్నాయంగా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించుకోవచ్చని, ఎల్ఈడీ తెరలకు కార్పొరేషన్ ఎలాంటి రుసుము వసూలు చేయదని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, బాల రాజ్‌కుమార్, కొమ్ము వేణు, శంకర్‌నాయక్, దొంత శ్రీనివాస్, నాయకులు సలీం, కల్వల సంజీవ్, గాదం నందు, నగునూరి రాజు, నీలం గణేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ అనిల్ కుమార్

మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కన్నుమూత



బిరుదు రాజమల్లు(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5: పెద్దపల్లి మాజీ శాసనసభ్యుడు బిరుదు రాజమల్లు (74) సోమవారం ఉదయం కన్నుమూశారు. నరాల సమస్యతో పాటు శ్వాస కోశ, గుండె సంబంధిత అవస్థలతో ఆయన బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈనెల 1వ తేదీన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. అప్పటి నుంచి హైదరాబాదాద్‌లోని ఆయన కుమారిడి ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది. అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు. సోమవారం మధ్యాహ్నం రాజమల్లు పార్థివదేహాన్ని సుల్తానాబాద్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. ఆయనకు బార్య సుశీల, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కోడలు సమత ప్రస్తుతం సుల్తానాబాద్ మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

● పంచాయతీ కారోబార్‌గా ప్రస్థానం..

1950 అక్టోబర్ 1న జన్మించిన బిరుదు రాజమల్లు సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదవి 1976లో గ్రామ పంచాయతీ కారోబార్‌గా చిరు ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆదే సందర్భంలో ఎన్టీఆర్ అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేసి సంఘం ఆధ్వర్యంలో యువతకు శారీరక దారుఢ్య శిక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

● 1981లో సర్పంచ్‌గా రాజకీయ జీవితం

1981లో సుల్తానాబాద్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. కేడీసీసీబీ బ్యాంక్ చైర్మన్‌గా రైతులకు సేవలందించారు. అనంతరం సుల్తానాబాద్ ఎంపీపీగా ఎన్నికయ్యా రు. ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతగా 1983లో తెలుగుదేశం పార్టీ టికెట్టు ఆశతో ఉన్న రాజమల్లుకు కాకుండా పెద్దపల్లిని సంజయ్ విచార్ మంచ్‌కు కేటాయించడంతో బిరుదు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 1989లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 1994లో పోటీచేసి భారీ మెజార్టీతో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఇదే క్రమంలో టీడీపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా కూడా పని చేశారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

● బిరుదు రాజమల్లు లేని లోటు పూడ్చలేనిది: ఎమ్మెల్యే

మాజీఎమ్మెల్యే బిరుదు రాజమల్లు మరణం నియోజకవర్గ ప్రజలకు తీరనిలోటని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రాజమల్లు భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మంగళవారం ఉదయం రాజమల్లు అంతిమయాత్ర ఉంటుందని ఆయన తెలిపారు. బిరుదు రాజమల్లు మృతిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి, పెద్దపల్లి మాజీ ఎంపీ సుగుణకుమారి, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్ రాజయ్య, పోలీస్ ఉన్నతా ధికారులు సాయిబాబా, గిరిప్రసాద్, నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, సారయ్యగౌడ్, గాజుల రాజమల్లు తదితరులు నివాళులర్పించారు.

ఎలుగుబంటి దాడి ఘటనపై అధికారుల ఆరా

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 5: ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఈ నెల 4న ఎలుగుబంటి దాడి చేసిన సంఘటనలో అదే తండాకు చెందిన రైతు గుగులోతు హరిలాల్ తీవ్రగాయాల పాలైన విషయం విదితమే. సోమవారం రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల అటవీ శాఖ అధికారులు ఘటనపై ఆరా తీశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని అటవీ శాఖ అధికారులు దేవునిగుట్టతండా శివారు అటవీ ప్రాంతంలో పరిశీలించారు. ఎలుగుబంటి దాడి చేసినట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో పక్కనే ఉన్న కామారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారులకు ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు సమాచారం అందించారు. దాంతో ఆ జిల్లాకు సంబంధించిన అధికారులు చేరుకోవడంతో వారితో కలిసి మాచారెడ్డి మండలం సోమారిపేట, బంజేపల్లి తదితర అటవీ గ్రామాల్లో ఆరా తీశారు. పూర్తి స్థాయిలో విచారించగా దాడికి గురైన హరిలాల్‌ను మాచారెడ్డి మండలానికి చెందిన 108 వాహనంలో రెండు జిల్లాల సరిహద్దు నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని వాహన సిబ్బంది పేర్కొన్నారని ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు వివరించారు. గొల్లపల్లి, వీర్నపల్లి ఎఫ్ఎస్‌వోలు సాకారం, రంజిత్‌కుమార్, ఎఫ్‌బీవోలు, మాచారెడ్డి మండల అటవీ శాఖ అధికారులు ఉన్నారు.

నాటు బాంబులు పేలడమే కారణమా?

దేవునిగుట్టతండాలో రైతు గుగులోతు హరిలాల్‌పై ఎలుగుబంటి దాడిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హరిలాల్‌తో పాటు మరో ఇద్దరు కలిసి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంజేపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లి నాటు బాంబులను అమర్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పేలడంతో ఘటన చోటు చేసుకుందని వినవస్తున్నాయి. హరిలాల్‌తో పాటు మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని సమాచారం. గుట్టు చప్పుడు కాకుండా మాచారెడ్డి మండలానికి చెందిన 108 వాహనంలో ఎలుగుబంటి దాడి చేసిందని పేర్కొంటూ హరిలాల్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిసింది. మరో ఇద్దరిని కామారెడ్డికి తీసుకెళ్లినట్లు సమాచారం. హరిలాల్ పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలుస్తోంది. దీనిపై సిరిసిల్ల ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు వివరణ కోరగా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 5: రాజస్థాన్‌లో ఈ నెల 7 నుంచి 11 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గత నెల 28న జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు జైనపురం త్రిష, జక్కుల తేజస్విని, గుంతకాల యశ్వంత్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెడ్డవేని మధు, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహి పాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి పెటాటీఎస్ అధ్యక్ష,కార్యదర్శులు ఎ శ్రీనివాస్, ఎండి యూనుస్ పాష, డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు, హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి కలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెట్టిపల్లి అశోక్, బాద్యులు వి రాజేందర్, ఐ శ్రీనివాస్, వి రాజ్‌కుమార్, భాస్కర్, అనూప్‌రెడ్డి, వీర్ పాల్ తదితరులు అభినందించారు.


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

● కట్నం వేధింపులని తల్లిదండ్రుల ఫిర్యాదు

గంగాధర, ఫిబ్రవరి 5: గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన ఏగుర్ల స్వప్న(27) గత నెల 29న ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లికి చెందిన స్వప్నను గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన ఏగుర్ల కుమార్‌తో 2018లో వివాహం జరిపించారు. స్వప్నకు కుమారుడు, కుతురు జన్మించిన తరువాత సంవత్సరం నుంచి అదనపు కట్నంతో పాటు ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటూ కుమార్ వేధిస్తుండేవాడు. దీనిపై స్వప్న తల్లిదండ్రులు హిమ్మత్‌నగర్‌లో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి కుమార్‌కు 2.30లక్షలు ఇచ్చారు. కొన్ని రోజుల కాపురం సజావుగా సాగినా మళ్లీ ఎకరం భూమి కావాలంటూ భర్త కుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు వేధింపులకు గురిచేయగా మనస్థాపంతో జనవరి 29న ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి స్వప్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమ వారం మృతి చెందింది. స్వప్న తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బిట్‌కాయిన్ పేరుతో మోసం

వీణవంక ఫిబ్రవరి5: మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన వడ్లూరి రాజు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే అధిక డబ్బులు వస్తాయని ఆశపడి దాదాపు లక్ష ఏడు వేల రూపాయలు మోసపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జనవరి 6వ తేదీన అమిటల్ మార్కెటింగ్ కంపెనీలో జాబ్ ఉన్నదని మొదట కొంత డబ్బులు పెట్టుబడిగా పెట్టాలని అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ మెసెజ్ వచ్చింది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 1,07,000 రూపాయలు కాజేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రాజు పేర్కొన్నాడు.



తమ ఇళ్లను చూసుకుంటున్న మహిళలు

ఎట్లుండె నా పల్లె..

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో తేలిన అనంతగిరి

'ప్రాజెక్టుల నీళ్లు తగ్గినయి.. మన ఊరు తేలిందంటే ఇట్ల వచ్చినం.. అగో చూడు.. మన పంచాయతీ ఆఫీసు.. అట్లనే ఉంది.. పొట్లోల్ల చింత చూడు.. నీళ్లలో ఉన్నా.. ఎండినా.. అప్పటి తీరుగనే నిలబడి ఉంది.. హనుమండ్ల గుడి చూడు.. దేవుడు లేకపోయినా ఇంకా మంచిగనే ఉంది.. మన ఇండ్లన్నీ ఏమైపాయె.. ఎవళ కోసమో మనం పుట్టి పెరిగిన ఊరు ఇడిసి పోతిమి.. ప్రాజెక్టుకు మన ఊరిపేరన్నా పెట్టకపోయిరి.. మనది కాని కాడికి పోయి తిప్పలు పడవడితిమి.. ఏం చేద్దాం.. మన రాతే ఇంత ఉంది'.. ఇదీ అనంతగిరి నిర్వాసితుల ఆవేదన. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో నాలుగేళ్లుగా నీట మునిగిన అనంతగిరి గ్రామం కనిపిస్తోంది. గ్రామంలోని శిథిలాలను ఈ ఊరి నిర్వాసితులు వచ్చి చూసి ఆ ప్రాంతంతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు..

- కూలిన ఇళ్లను చూసి తమ అనుబంధాలు గుర్తు చేసుకుంటున్న నిర్వాసితులు
- అన్నంపెట్టిన ఊరును విడిచి అష్టకష్టాలు పడుతున్నామంటూ ఆవేదన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో మునిగిన అనంతగిరి గ్రామంలోని శిథిలమైన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఊరితో తమకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకొని గ్రామస్థులు శిథిలమైన తమ ఇళ్లను చూస్తూ తమ బాధను దిగమింగుకుటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామసమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. తాము గ్రామాన్ని విడిచిపెట్టలేమని, ప్రాజెక్టు డిజైన్ మార్చాలని గ్రామస్తులు చేసిన పోరాటాలు పనిచేయలేదు. అనంతగిరి గ్రామానికి చెందిన 2,500 ఎకరాల భూమిని సేకరించారు. ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యేనాటికి ఉన్న 837 ఇళ్లు, 1,135 కుటుంబాలకు పరిహారం ఇచ్చి గ్రామాన్ని ఖాళీ చేయించారు. 2020లో ప్రాజెక్టును ప్రారంభించి దానికి అన్నపూర్ణ రిజర్వాయర్‌గా నామకరణం చేశారు. తాము సర్వస్వాన్ని కోల్పోయినందున కనీసం తమ గ్రామం పేరు అయినా అనంతగిరి ప్రాజెక్టుకు పెట్టాలని గ్రామస్థులు కోరారు. లేకపోతే తమ గ్రామంలోని ముత్యాల పోచమ్మ పేరు పెట్టాలని వేడుకున్నారు. ప్రభుత్వం వారి వినతులను పట్టించుకోలేదు.



నీరు తగ్గడంతో తేలిన ఇళ్ల శిథిలాలు

● నాలుగు సంవత్సరాలకు తేలిన గ్రామం

అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించిన నాలుగు సంవత్సరాలు నిండుకుండలా ఉండేది. ప్రస్తుతం ఒక టీఎంసీ నీరు మాత్రమే ఉండటంతో శిథిలమైన ఇళ్ళు కనిపిస్తున్నాయి. తమ ఇల్లు ఎక్కడ ఉందో గుర్తించి గ్రామస్తులు కుటీంబీకులతో కలిసి చూసి వస్తున్నారు. శిథిలమైన ఇంటి భవనాల నుంచి కొంతమంది స్టీల్‌ను తీసుకెళుతున్నారు. గతంలో గ్రామానికంతటికి ఆలంబనగా నిలిచిన కుమ్మరికుంట, కొత్తచెరువులు బోసిబోయి కనిపిస్తున్నాయి. గ్రామస్తులంతా ప్రతి రోజు మంచి చెడులు మాట్లాడుకునే పొట్లోల్ల చింత ఇప్పటికీ నిలబడే ఉంది. గ్రామపంచాయితీ కార్యాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, ప్రభుత్వ పాఠశాల భవనాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి.



ప్రాజెక్టు నిర్మాణానికి ముందు అనంతగిరి గ్రామం (ఫైల్)

● సమస్యలు తీరలేదు

తమ పుట్టిన ఊరును విడిచిపెట్టినా తమ సమస్యలు మాత్రం తీరలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి కొంత మందికి పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. మరికొంత మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు.



పాఠశాల భవనాలు

పుట్టిపెరిగిన ఊరును చూసి బాధను దిగమింగుకుంటున్నాం..



- కూనబోయిన శంబయ్య, అనంతగిరి

పుట్టిపెరిగిన ఊరి ప్రస్తుత పరిస్థితిని చూసి బాధను దిగమింగుకుంటన్నాం. గ్రామంలో అన్నిరకాల పనులు చేసుకునేవాళ్లం. అందరం పొట్లోల్ల చింత దగ్గర కలిసి మంచీ, చెడు మాట్లాడుకునేవాళ్లం. ఇప్పుడు కాలనీలో అలాంటి పరిస్థితి లేదు. ఊరుతేలిందని పిల్లలు తీసుకువస్తే వచ్చిన. కూలిన ఇంటిని చూస్తే ఎంతో బాధ అనిపిస్తోంది. 80 సంవత్సరాలు అనంతగిరి గ్రామంలోనే ఉన్నా. ముసలితనంలో ఊరికి దూరమైన.

ఊరు విడిచి ఎటుగాని వాళ్లం అయ్యాం



- వల్లంపట్ల రాజవ్వ, అనంతగిరి

ప్రభుత్వం ప్రాజెక్టు కట్టడంతో ఊరు విడిచి కాలనీకి పొయ్యి ఎటుగాని వాళ్లమయ్యాం. ఇన్నిరోజులు నీరు ఉండటంతో ఏమీ అనిపించ లేదు. ఇండ్లు తేలిన తర్వాత వచ్చి చూస్తే ఎంతో బాధనిపిస్తోంది. పరులకు కూడా ఇటువంటి కష్టాలు రావద్దు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో నేడు విచారణ

● ఢిల్లీకి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5: సుప్రీంకోర్టులో మంగళవారం ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు జడ్జీల బెంచ్ ముందు వాదనలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్‌కుమార్, మానకొండూర్, జుక్కల్ ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తోట లక్ష్మీకాంతరావు ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ నలుగురు వాదనలు వినిపించేందుకు అవసరమైన సమాచారంతో అడ్వకేట్లతో సహా ఢిల్లీకి వెళ్లారు. జనాభా దామాషా పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ జరుగాలనే అంశంపై చర్చిస్తారని పార్టీవర్గాలు వెల్లడించాయి.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 5: చోరీ కేసులో నిందితురాలికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ప్రవీణ్ సోమవారం తీర్పు ఇచ్చారు. ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌కి చెందిన జంగటి లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గంభీరావుపేటకు చెందిన పాటి సునీత మాయమాటలు చెప్పి బంగారు అభరణాలు దోచుకొని పరారైంది. ఈ ఘటనపై బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు పాటి సునీతను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందతురాలిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధించారు.

హుజూరాబాద్‌లో కోతుల బెడద

● ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, ఫిబ్రవరి 5: హుజూరాబాద్ పట్టణంలో రోజు రోజుకు కోతుల బెడద ఎక్కువైంది. పది రోజుల క్రితం విద్యానగర్‌లో కోతులు ఒకరిని గాయపరచగా తాజాగా సోమవారం పట్టణంలోని తునికి సమ్మయ్య, ఆర్ లచ్చమ్మలను ఇంటి ముందు కోతులు దాడి చేశాయి. చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. హుజూరాబాద్‌లో వేలాది కోతులు రోడ్డు వెంట తిరుగుతున్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన మున్సిపల్ పాలకవర్గం అటూ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా ప్రజలు కోతుల బెడదతో భయపడుతున్నారు. తలుపు తీసి ఉంటే ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందర వందర చేయడంతో పాటు దాడలు చేస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. రోడ్డుపైకి వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోతుల బెడద లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భక్త జనసంద్రంగా రాజన్న క్షేత్రం



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు



ఆలయ పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచిన భక్తుల వాహనాలు

వేములవాడ, ఫిబ్రవరి 5: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ప్రతినిత్యం వేలాది మంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నుండి సోమవారం రాత్రి వరకు సుమారు 80 వేలకు పైగా భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి ప్రారంభమైన శ్రీ స్వామివారి దర్శనం రాత్రంతా కొనసాగగా సోమవారం రాత్రి వరకు భక్తులు నిరంతరాయంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటలకు పైగా నిరీక్షించి ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రుద్రంగి ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన సుద్దాల భూమయ్య కొద్ది రోజులుగా కొండగట్టులో ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు భూమయ్య కూతురుకు సమాచారం అందించారు. దీంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో చోరీ సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై అశోక్ తెలిపారు.

తాళాలు పగులగొట్టి

'డబుల్' ఇళ్లలోకి ప్రవేశం



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 5: డబుల్‌బెడ్‌రూంల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ ద్వారా జరిగినా అప్పగించక పోవడంతో పెద్దలింగాపూర్ గ్రామంలో లబ్ధిదారులు తాళాలు పగలగొట్టి గృహప్రవేశం చేశారు. ప్రభుత్వం డబుల్‌బెడ్ రూంల నిర్మాణంలో భాగంగా పెద్దలింగాపూర్ గ్రామంలో 40 డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గ్రామ సభ ద్వారా 16 నెలల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం మారడం గ్రామంలో మరోసారి గ్రామ సభ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందనే వదంతులు వ్యాపించడంతో లబ్ధిదారులు సోమవారం ఉదయం తాళాలు పగటగొట్టి గృహప్రవేశాలు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జావెద్‌అహమ్మద్, ఎస్సై సుధాకర్, ఆర్ఐ షఫీలు డబుల్‌బెడ్‌రూం వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. త్వరలోనే ప్రొసీడింగ్‌లు అందిస్తామని, అప్పటి వరకు డబుల్‌బెడ్‌రూంల నుంచి వెళ్లిపోవాలని లబ్ధిదారులకు అధికారులు సూచించారు.

మెడపై కత్తి పెట్టి బంగారు ఆభరణాలు అపహరణ

కోనరావుపేట, జనవరి 5 : ఓ మహిళ మెడపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తి పెట్టి మూడు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగల కోసం డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన నంది సిద్ధవ్వ సోమవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల ప్రాంతంలో బాత్రూం కోసం బయటకు వచ్చింది. అక్కడే ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా ఆమె మీద పడి ఒకరు గొంతుపై కత్తి పెట్టి నోరు మూసి మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవులకున్న కమ్మలు అపహరించారు. అరుస్తే చంపేస్తామని బెదిరించారు. సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు రెండు లక్షల విలువ గలవి దొంగిలించి పరారయ్యారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, వేములవాడ డిఎస్‌పి నాగేంద్రచారి, చందుర్తి సిఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్కాడ్‌తో గాలింపు చేపట్టారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కొంతమంది యువకులు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారని మంగళపల్లిలో జరిగిన చోరీని త్వరలోనే చేధిస్తామని గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో దొంగతనం జరిగిన తీరును పరిశీలించి మాటాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేసవిలో దొంగతనం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.



వివరాలు సేకరిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ఎంపీపీ స్రవంతి

ఎలిగేడు, ఫిబ్రవరి 5: ప్రజలకు జవాబుదారీగా ఉండి పనిచేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ తాడిపర్తి స్రవంతిమోహన్‌రావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రజాసేవను మించింది లేదన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో సర్పంచ్‌లు చూపించిన తెగువను ఆమె కొనియాడారు. రానున్న రోజుల్లో గ్రామ స్పెషల్ ఆఫీసర్లు ప్రజలు జవాబుదారీగా ఉండి ప్రజాసమస్యలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో నీటి, కరెంటు ఎద్దడి సమస్యలకు తావులేకుండా చూడాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు మాజీ ప్రజాప్రతినిధుల సూచనలు సలహాలు పాటించి ప్రజలకు అండగా ఉండాలని పేర్కొన్నారు. నర్సాపూర్ గ్రామంలో మిషన్‌భగీరథ పథకం ప్రారంభించినప్పటి నుంచి నీటి సరఫరా ట్యాంకులకు ఎక్కడం లేదని పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో తాగునీటిని, బావుల్లోకి భగీరథ నీరును సరఫరా చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. దీంతో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందడం లేదన్నారు. అలాగే ధూళికట్టలో ప్రజలకు అవసరమైన తాగునీరు అందడంలేదని మరికొంత నీటిని సరఫరా చేయాలని మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్ పేర్కొన్నారు. అనంతరం పదవీ కాలం పూర్తిచేసుకున్న 12మంది సర్పంచ్‌లను ఎంపీపీ స్రవంతిమోహన్‌రావు, జడ్పీ వైస్‌చైర్మన్ మండిగ రేణుకరాజనర్సు, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎంఈవో కవిత, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లలో యాజమాన్యాలు చొరవ చూపాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఫిబ్రవరి 5: గోదావరిఖని, గోలివాడలలో జరిగే సమ్మక్క, సారాలమ్మ జాతర ఏర్పాట్లకు సంబంధించి స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు మరింత చొరవ చూపాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి సోమవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. గతంలో జరిగిన జాతరల కన్నా ఈసారి జాతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తాత్కాలిక నిర్మాణాల కన్నా పక్కా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర సాఫీగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వరరావు, ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు పాల్గొన్నారు.

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరంలో ఈ నెల 21 నుంచి 24వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతర ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్ల పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, జాతర కమిటీ సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు, ఎంపీడీఓ యాదగిరి, జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దర్ని రాజేష్, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, నాయకులు ఆవుల గోపాల్‌యాదవ్, కోల రాంమూర్తిగౌడ్, సింగం కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు. అదే విధంగా అంతకు ముందు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియా ఎస్టీ కాలనీలో రూ.15లక్షల నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ బంగి అనీల్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, నాయకులు సలీంబేగ్, ఇష్తాకర్ అహ్మద్, ఈదునూరి హరిప్రసాద్, మేకల ఫైసయ్య, అనిత చౌదరి, సతీష్‌గౌడ్, చాంద్‌పాషా, కొండల రాజేందర్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్

● క్రీడలతో మానసికోల్లాసం..

కోల్‌సిటీటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. తమిళనాడు జరిగిన ఎస్‌టీకే రోలర్ స్కేటింగ్‌లో విజయం సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. సోమవారం రాత్రి మార్కండేయకాలనీలోని కాకతీయ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు జ్ఞానాన్ని పెంపొందిస్తాయని, తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, అనుమ సత్యనారాయణ, ఇండ్ల ఓదెలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరెట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిటౌన్, జనవరి 5: జిల్లాలోని మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతామని, పర్మినెంట్ చేసే విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారని, రెండు నెలలు పూర్తయిన దానిపై దృష్టి సారించడం లేదని, ఈనెల 8 నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రామగుండం, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో గత మూడు సంవత్సరాలుగా ఇవ్వవలసిన బట్టలు, సబ్బులు, చెప్పులు, నూనె, పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న అదనపు కార్మికులను కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో తీసుకోవాలని తద్వారా పేద కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పాక మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్, వెంకట స్వామి, మహిళా రాష్ట్ర కన్వీనర్ నాగమణి, వివిధ మున్సిపాలిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకూరి సాగర్, మహంకాళి సురేష్, యు, రాధా కిషన్, సిహెచ్, లక్ష్మణ్, వడ్లకొండ రాజయ్య, సిహెచ్, చందు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 5: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని, ఇందుకు కార్యకర్తలు నాయకులు సమిష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రాఘవపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో రాష్ట్రాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు అవగాహన లేకుండా, ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం, తెలంగాణలో నాగార్జున సాగర్ ప్రాజెక్టులున్నాయని, మన రాష్ట్ర నీటి వాటా కోసం గట్టిగా మాట్లాడమని గుర్తు చేశారు. ఆంధ్ర, తెలంగాణ అధికారులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు ప్రశ్నించకపోతే తెలంగాణ రాష్ట్రాన్ని కూడా అప్పగించేందుకు వెనుకడారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో ఏడు అసెంబ్లీ స్థానాలు చేజారినా పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

● ఎమ్మెల్యే క్యాంపులకు అడ్డాలుగా మార్చారు..

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా హైదరబాద్ ఐటీ పరిశ్రమలకు అడ్డాగా ఉండేదని, కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పలు రాష్ట్రాల ఎమ్మెల్యేల క్యాంపులకు అడ్డాలుగా మారిందని మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. జార్ఖండ్, బీహార్ ఎమ్మెల్యేల క్యాంపులకు హైదరబాద్ వచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ గుంపు మేస్త్రీ అని, పరిపాలన చేతగాక మాజీ సీఎం కేసీఆర్ పట్టుకొని రండ అని మాట్లాడుతున్నాడన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబి జెండా ఎగిరేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమిల్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఓదెల జడ్పీటీసీ గంట రాములు, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ విప్ బాల్క సుమన్

● సమావేశంలో రసాభాస..

పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభం అవుతుండగా పెద్దపల్లి ఎంపీపీ బండారి స్రవంతి భర్త శ్రీనివాస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లను వేదికపైకి పిలుస్తుండగా సమావేశానికి వచ్చిన పెద్దపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తబ్రేజ్ సీనియర్‌లకు ఎందుకు గౌరవం ఇవ్వడం లేదని వేదికపైకి కుర్చీ విసిరేశారు. దీంతో వేదిక వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమావేశానికి వచ్చిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తబ్రేజ్‌ను సముదాయించడంతో సమావేశం యథావిధిగా సాగింది.

సింగిల్‌విండో చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ముత్తారం, ఫిబ్రవరి 5: ముత్తారం సింగిల్ విండో కార్యాలయంలో జరిగిన అక్రమాలు, సంస్థ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డిపైన కలెక్టర్‌కు, డీసీవోకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య సోమవారం పెద్దపల్లి కలెక్టరెట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ముత్తారం మండల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఐదేళ్లుగా జరుగుతున్న సుతిలి కొనుగోలు పేరిట జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణంపై, కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగుల తరహాలో సుతిలి పంపిణీ, సహకార సంఘంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని ఆయన కోరారు. ముత్తారం సహకార సంఘం నుంచి సరఫరా అయిన ఎరువులను, పురుగుల మందులను ప్రైవేట్ వ్యాపారులకు అక్రమంగా అమ్ముకొని రైతుల పేరిట తప్పుడు బిల్లులు సృష్టించారన్నారు.

సహకార సంఘం నుంచి లోను తీసు కుంటే ప్రతీ ఒక్క సభ్యుడి చేత ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన ఇన్సూరెన్స్‌లో తప్పనిసరిగా పాలసి చేయాలనీ బలవంతం చేసి రూ. 20 వేల నుంచి 50 వేల వరకు ఇ న్సూరెన్స్ డబ్బులు కట్ చేసుకుని రైతులకు తీవ్ర అన్యా యం చేస్తున్నాడన్నారు. తన పదవిని అడ్డుపెట్టుకొని అక్రమంగా సంపాదన చేసిన గుజ్జుల రాజిరెడ్డిపై విచారణ జరిపించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సన్మానం

పాలకుర్తి, ఫిబ్రవరి 5: మండలంలోని జయ్యారం గ్రామ సర్పంచ్ చింతకింది నర్సమ్మ, ఉపసర్పంచ్ గాజుల ప్రసాద్ గౌడ్ పదవీకాలం ముగియడంతో సోమవారం పంచాయతీ కార్యలయం ఆవరణలో వారితో పాటు వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆవులం శోభరాణీ, జంగిలి రజిత,ఎఎన్ ఎం నగునూరి సరిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌ను మాదిగలకు కేటాయించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను స్థానిక మాదిగ నేతలకే కేటాయించాలని మాదిగ ఐక్య వేదిక నాయకులు వివిధ పార్టీల వారిని డిమాండ్ చేశారు. సోమవారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మామిడిపల్లి బాపయ్య, పల్లె సదానందం, కాంపల్లి ప్రభాకర్, న్యాతరి శ్రీనివాస్, మంథని రమేష్ సంకెనపల్లి లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు. ఇప్పటి వరకు పెద్దపల్లి నుంచి మాదిగలకు టికెట్టు కేటాయించలేదని ఈసారైన ఆయా పార్టీల వారు మాదిగలకు అవకాశం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 5: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రముఖ సైకాలజిస్ట్ మురళి అన్నారు. మండలంలోని మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు లక్ష్యాలు ఎలా ఏర్పరుచుకోవాలని, పరీక్షల్లో మంచి గ్రేడ్ సాధించాలంటే ఎలా చదవాలో ఆయన వివరించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించిన మురళిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సత్యలక్ష్మి, ఉపాధ్యాయులు జీ మధు, బండి ప్రభాకర్, దిడ్డి సతీష్, కేశవర్ధన్‌రెడ్డి, బీ ప్రభాకర్, బీ శ్రీనివాస్, టీ పద్మావతి, ధర్మరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి



క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 5: పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికాసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా 29వ డివిజన్ బాపూజీనగర్, సీఎస్‌పీ కాలనీలో నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి పథకాల క్యాలెండర్‌ను సోమవారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులకు విశ్వకర్మ యోజన ద్వారా రుణాల మంజూరు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి ఆయుష్మాభవ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని, ఉచిత బియ్యం, మహిళల కోసం గ్యాస్ కనెక్షన్లు, పేదలకు ఇండ్ల పంపిణీ ప్రధాని మోదీ పదేళ్లలో చేసి చూపించారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి మూడవ సారి నరేంద్ర మోదీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. జనగామ మండల అధ్యక్షుడు మామిడి సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి రేణుక, అడ్లూరి రాజేష్, శ్రావణ్‌కుమార్, మల్లేష్, గుండ్రాతి మల్లయ్య, వేణురెడ్డి, సదానందం, రాము, భరత్, నరేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థులకు పతకాలు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీ వెంకటస్వామి స్మారకార్థం విక్టరీ ఫోటోకాన్ కరాటే అసోసియేషన్ డూ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 4న బెల్లంపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కటాస్ విభాగంలో విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకునారు. ఎం.ముక్తిశ్రీ, ఎం.కార్తికేయన్, కార్తిక, డి.శ్రీవర్షిని, డి.సాత్విక్, రిషి వరుణ్, బి.శ్రీయన్, లక్ష్మిప్రియ,టి.సాత్విక్, సాయిసహస్రజిత్, బి.జితేష్, శివకృష్ణ, అంకూర్‌త్రివేది, వివేకానంద, వాన్య, టి.సహస్ర, ఎల్.హర్షిత్‌రెడ్డి, సుదీష్‌లు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించగా బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, సెక్రటరీ ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, శుభశ్రీ, అభిజ్ఞ అభినందించారు.

సంక్షిప్త సమాచారం..

ధర్మారం: మండల కేంద్రంలోగల సమ్మక్క-సారక్క గద్దెల వరకు సోమవారం అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభించారు. ధర్మారం-ఎండపల్లి బైపాస్ వెళ్లే రోడ్డు పక్కన గల సమ్మక్క-సారక్క జాతర జరిగే ప్రదేశం వరకు చెట్లను తొలగించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు.

రామగిరి: విద్యారంగంలో నాలుగు దశాబ్దాలపాటు సేవలు అందించిన పురం మాధవరావుకు జేసీఐ స్వచ్ఛంద సంస్థ విద్యారత్న అవార్డు ప్రకటించారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో జరిగిన రోడ్డు ప్రమాద నిందితుడికి సోమవారం 10 నెలలు శిక్ష పడ్డట్లు స్థానిక ఎస్సై సుల్వ వెంకటేష్ తెలిపారు. ఎండీ రఫిక్ (30)అనే ఆటో డ్రైవర్ ఓ రోడ్డు ప్రమాదానికి కారకుడు కాగా అతనికి పెద్దపల్లి జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె రాణీ ఇరు పక్షాల వాదనలువిన్న తరువాత నిందితుడికి శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.



ఉత్పత్తి లక్ష్యాల సాధన సమష్టి కృషితోనే సాధ్యం

రామగిరి, ఫిబ్రవరి 5: సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టి కృషితోనే సాధ్యమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీడిపార్టమెంట్ సమావేశాల్లో భాగంగా ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను సాధించగలగుతామని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశించిన 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ ఎలీషా, అధికారులు రఘుపతి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రవీందర్, నాగరాజు, రామారావు, కుమారస్వామి, యూనియన్ నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏల్లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు

రామగిరి, ఫిబ్రవరి 5: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలో ఐదు రోజుల పాటు నిర్వహించే మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలను సోమవారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు జీఎం కార్యాలయంలో వెల్లడించారు. మంగళవారం, బుధవారం ఓసీపీ-1లో, గురువారం ఓసీపీ-1 సిహెచ్‌పీ, జీఎం కార్యాలయంలో, శుక్ర, శనివారాల్లో ఏఎల్‌పీ గనులు, డిపార్ట మెంట్‌లో సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశాల్లో సింగరేణి ప్రగతి, ఉత్పత్తి లక్ష్యాలపై, ప్రణాళికలపై అవగాహన సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

దేశ రక్షణలో డ్రోన్ల పాత్ర కీలకం

రామగిరి, ఫిబ్రవరి 5: దేశ రక్షణలో డ్రోన్ల పాత్ర కీలకంగా మారిందని ఆర్జీ-3 ఏరియా ఇంజనీర్ ఏలీషా అన్నారు. సోమవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ యూనీవర్సిటి(మంథని)లో మెకానికల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతి థిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశ రక్షణ, వ్యవసాయ రంగాల్లో డ్రోన్ల పాత్ర కీలకంగా మారిందన్నారు. ఏరియా ఇంజనీర్ ఏలీషా ఇచ్చిన టాస్క్‌ను చాలెంజ్‌గా తీసుకొని పూర్తిచేయాలని కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీజీఎం ఎర్రన్న, సూపరింటెంటెండ్ రవికుమార్, స్పెస్‌చేజ్ డైరెక్టర్ పీయూష్‌ఝా, టీం సభ్యులు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ఓసీపీ-3లో షావల్స్ ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 5: ఓసీపీ-3 ప్రాజెక్టులో నూతనంగా కొనుగోలు చేసిన షావల్స్‌ను జీఎం సూర్యనారాయణ సోమవారం ప్రారంభించారు. కృషిభవన్ ఇంటర్నల్ పార్కింగ్ యార్డులో రెండు షావల్స్ యంత్రాలకు పూజలు చేసి వాటిని నడిపి వినియోగంలోకి తెచ్చారు. ప్రాజెక్టు అవసరాల దృష్ట్యా టాటా హిటాచి కంపెనీకి చెందిన 6.5 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల షావల్ ఒక్కోదాని విలువ 4.63 కోట్లని జీఎం తెలిపారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ జిగురు రవీందర్, పీవో మధుసూదన్, ఎస్వోటూ జీఎం బచ్చ రవీందర్, పీఈ రాజాజీ, మేనేజర్ భరత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 5: సీఐటీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఓసీపీ-3 స్టోర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఉల్లి మొగిలి మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశంలోని అన్ని సంఘాలు సమ్మెకు నిర్ణయించాయని, సింగరేణి ఉద్యోగులు సమ్మెలో పాల్గొని విజయ వంతం చేయాలని మొగిలి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రాజశేఖర్, నర్సింగ్, నరసింహులు, వెంకటేష్, రషీద్‌ఖాన్, సాంబయ్య పాల్గొన్నారు.

● కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొనాలి..

సింగరేణిలో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఫిబ్రవరి 16న జరగనున్న సమ్మెలో పాల్గొనాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్ అన్నారు. సోమవారం కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేసే ప్రయత్నం చేస్తున్నదని, బొగ్గుతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి దేశ పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా జరగనున్న సమ్మెలో సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొని కార్మిక శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో లక్ష్మి, సమ్మయ్య, నవీన్ పాల్గొన్నారు.

జ్యోతినగర్: ఈనెల 16న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత బందును విజయవంతం చేయాలని సీఐటీయూ ఎన్టీపీసీ ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎన్.బిక్షపతి కోరారు. సోమవారం మేడిపల్లి సెంటర్ భవన నిర్మాణ అడ్డాలో సీఐటీయూ నాయకులు సమ్మెపై ప్రచారం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్నదని, కార్మిక చట్టాలను సవరించి కార్మిక వర్గానికి నష్టం కల్గిస్తోందని ఆరోపించారు. అ లాగే కార్మికులకు నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం చెల్లించాలని, నెలకు 10 వేల రూపాయల పెన్షన్ చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలోని కార్మికులు, ప్రజలు సమ్మెలో పాల్గొనాలను కోరారు.

మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 5: వకీల్‌పల్లె గనిలో సోమవారం మల్టీడిపార్ట్‌మెంట్ బృందం సమావేశం నిర్వహించింది. ఈసమావేశంలో 2023-24 సంవత్సరంలో ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణాతో పాటు 2024-25 కంపెనీ లక్ష్యాలు, భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం, భవిష్యత్తు ప్రణాళికలు, సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సభ్యులు ఉద్యోగులకు వివరించారు. అనంతరం ఉద్యోగుల నుండి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో వీకేపీ గని పనితీరు మెరుగుగా ఉన్నట్టు జీఎం సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, వీకేపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరెడ్డి, మల్టీడిపార్ట్‌మెంట్ బృందం సభ్యులు నరసంహారావు, బచ్చ రవీందర్, రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఓసీపీ-1 పీవో రాధాకృష్ణకు అదనపు బాధ్యతలు

రామగిరి, ఫిబ్రవరి 5: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-1 పీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాధాకృష్ణకు సోమవారం 10వగని పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జీడీకే 10వ, గనిలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పదవీ బాధ్యతలను స్వీకరించారు. సంస్థ తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అప్పగించడంపై రాధాకృష్ణ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిబ్రవరిలోనే లక్ష్యాన్ని అధిగమించిన ఓసీపీ-1



మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 5: 56 వార్షిక సంవత్సరం ముగియడానికి 56 రోజుల ముందే ఓసీపీ-1 ప్రాజెక్టుకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించినట్టు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పేర్కొన్నారు. సోమవారం ప్రాజెక్టు ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పీఓ రాధాకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. 2023-24 వార్షిక సంవత్సరానికి 30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. ఈనెల 4(ఆదివారం)తో 30లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు తెలిపారు. నెలవారి లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు సాధిస్తూ ప్రణాళికా బద్ధంగా పనిచేయడం ద్వారా 56 రోజుల ముందు వార్షిక లక్ష్యాన్ని అధిగమించామన్నారు. వార్షిక లక్ష్యాన్ని సాధించిన ఓసీపీ-1 అధికారులు, ఉద్యోగులకు జీఎం సుధాకర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మేనేజర్ ఉదయ్‌హరిజన్, పీఈ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయికృష్ణ, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు గౌతం, గడ్డం తిరుపతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని, ఎలాంటి యాప్‌లను వాడి మోసపోవద్దన్నారు. యువతులు వారి ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలకు బాధితులు అవుతారని, ఈ విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్, లెక్చరర్లు బాలరాజు, రమేష్, స్వప్న, రాము, అజ్గార్, హుస్సేన్, హెడ్‌కానిస్టేబుళ్లు సంపత్, అశోక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ముత్తారం, ఫిబ్రవరి 5: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులచే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. యువత పెడదోవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. నేటి యువత 18సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లలో చాలామంది మరణాలపాలవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గ్యారంటీలో అమలవుతున్న రెండు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కోండ్ర వెంకటేశ్వర్లు, ఇల్లందుల మల్లేష్ జిన్నరమ, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

అంతర్గాం, జనవరి 5: పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన జరుగుతుందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎస్‌సీఆర్‌ఎంయూ జోనల్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు అన్నారు. సోమవారం రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో మజ్దూర్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ రైల్వేను ప్రైవేట్‌పరం చేసే చర్యలకు పూనుకున్నదని ఆరోపించారు. ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) యూనియన్ వంద సంవత్సరాలుగా కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మికులపై పని భారం మోపుతూ ఒత్తిడికి గురి చేస్తుందని ఆరోపించారు. రైల్వే సంస్థలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పాత పెన్షన్ విధనాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌ఎంయూ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, రామగుండం బ్రాంచ్ చైర్మన్ రామారావు, సెక్రటరీ ఓవై స్వామి, వీరన్న, మోజెస్, రజనీకాంత్ ఆనంద్ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 5: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు 2023-24 సంవత్సరానికి వివిధ జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీలలో చదువుతున్న మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు మార్చి 31 వరకు గడువు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మైనారిటీ విద్యార్థులు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు అవసరమగు డాక్యుమెంట్స్ అప్ లోడ్ చేసి, కళాశాలలో ఇవ్వాలని మొహమ్మద్ మేరాజ్ మహ్మూద్ తెలిపారు.